క్లుప్తంగా

అహోబిలంలో ఎమ్మెల్యే పూజలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. త్వరలో జరగబోవు ఎన్నికలకు సంబంధించి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఈనెల 15 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్న సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మతల్లి గ్రామోత్సవం

పోరుమామిళ్ల : శ్రీ బంగారు యల్లమ్మతల్లి ప్రతిష్ఠ ఉత్సవాలు జయప్రదంగా నిర్వహిస్తున్నారు. పట్టణం నుంచి రెడ్డికొట్టాలకు వెళ్లే దారిలో నిర్మించిన యల్లమ్మతల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో పూజాకార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.మంగళవారం యల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహంతో పట్టణంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

16న రథసప్తమి వేడుకలు

పోరుమామిళ్ల : స్థానిక శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16న శుక్రవారం రథసప్తమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తులసి సురేష్‌బాబు, జనార్ధనశెట్టి తెలిపారు. 16న ఉదయం 5 గంటల నుండే పూజా కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. 7 గంటలకు సూర్యప్రభ వాహన సేవ, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

నూతన నియామకం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ అన్వర్‌ను కాంగ్రెస్ పార్టీ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం పీసీసీ మీడియా చైర్మన్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినందుకు తగిన గుర్తింపు లభించిందన్నారు.

ఎస్.అనంతపురంలో పశు వైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న పశు వైద్యాధికారి విజయకుమార్

చాపాడు : మండల పరిధిలోని ఎస్.అనంతపురం గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి విజయకుమార్ మాట్లాడుతూ పాడి రైతులు పశు వైద్యుల సూచనల మేరకు మినరల్ మిక్షర్ ఇస్తే సకాలంలో ఎదకు వచ్చి కట్టు నిలుస్తుందన్నారు. ఎద లక్షణాలు గమనించాలని, లక్షణాలు కనపడగానే రైతులు పశువులకు ఎద సూదులు వేయించుకోవాలని సూచించారు. పాడి రైతులు తరచూ తమ పశువుల సమస్యలపై ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సంప్రదించాలన్నారు. అనంతరం ఉచిత పశు వైద్య శిబిరంలో 50 పశువులు, 185 జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి వాటికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది లక్ష్మినారాయణ, శ్రీకాంత్, చలపతి, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి అమీర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : రాబోవు ఎన్నికల్లో నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో బద్వేలు రూరల్, గోపవరం మండలాల బూత్‌కన్వీనర్లు, కో కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన నేను సిద్ధం – నా బూత్ సిద్ధం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రతిఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రచార అస్త్రాలుగా ప్రజల ముందుకు వెళ్లాలని కోరారు. అంతేకాకుండా ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజలను చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్న పోలిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, బద్వేలు, గోపవరం మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, పుల్లయ్య, ఎంపీటీసీ రాజేశ్వరి, సర్పంచ్‌లు లక్ష్మిదేవి, రాధాకృష్ణ, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేను సైతం జగనన్న కోసం..



ప్రచారంలో భాగంగా బద్వేలుకు చేరుకున్న అమర్ నాథ్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : తన అభిమాన నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్న లక్ష్యంతో ఓ యువకుడు చేస్తున్న కృషి వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రామిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే పంచప్రాణాలు. విశాఖ సమీపంలోని దువ్వాడలో లీఫార్మా ప్రైవేటు లిమిటెడ్‌లో కొన్నేళ్లుగా క్వాలిటీ విభాగంలో పనిచేస్తున్నాడు. తన అభిమాన నాయకుడు వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మంచిని వివరించి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్న ఉద్దేశంతో రూ.40 వేలు వచ్చే ఉద్యోగాన్ని సైతం వదిలి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారానికి శ్రీకారం చుట్టాడు. ఇందుకోసం తన ద్విచక్ర వాహనాన్ని ప్రచారరథంలా మార్చుకున్నాడు. గత నెల 28న విశాఖ జిల్లా భీమిలిలోని సంగివలస వద్ద నిర్వహించిన సిద్ధం సభలో పాల్గొని అక్కడ నుండి ప్రచారానికి శ్రీకారం చుట్టాడు. ఈ క్రమంలో మంగళవారం బద్వేలుకు చేరుకున్న ఆయనను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు అభినందించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు ప్రతి గ్రామంలో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తానని పేర్కొన్నారు.

గైర్హాజరైన అధికారులపై ఫిర్యాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

గోపవరం : మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే సభ్యులు లేవనెత్తిన అంశాలకు ఎవరు సమాధానం చెబుతారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కేవలం మొక్కుబడిగానే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు రాకుండా వారి సిబ్బందిని పంపించడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఇకమీదట ఇలా జరగకుండా అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలన్నారు. ఎంపీపీ ధనలక్ష్మి మాట్లాడుతూ గత సమావేశంలో లేవనెత్తిన అంశాలు ఏ మేరకు పరిష్కారమయ్యాయో అధికారులే నిర్ణయించుకోవాలన్నారు. పదేపదే మొదటి సమావేశాల్లో లేవనెత్తిన అంశాలనే సభ్యులు ప్రస్తావిస్తున్నారంటే ఏ మేరకు అధికారులు పనిచేస్తున్నారో చెప్పకనే తెలిసిపోతుందన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి పరిష్కారం కోసం 9 పనులకు సంబంధించి టెండర్లు పిలవడం జరిగిందని, ఇప్పటి వరకు ఎవరూ కూడా టెండర్లు దాఖలు చేసుకోలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అన్నిశాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దారు రోశయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, మండల ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరి, సర్పంచ్‌లు శ్రీనివాసులు, వెంకటలక్షుమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి ఆధునికీకరణకు నేడు భూమిపూజ

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని దళితవాడలో ఉన్న సీఎస్ఐ చర్చిని రూ.12 లక్షలతో ఆధునికీకరణ చేపట్టనున్నారు. దీని నిర్మాణం కోసం బుధవారం ఉదయం 8.30గంటలకు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిచే భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదెల లక్షుమయ్య తెలిపారు.

నేడు సిద్ధం కార్యక్రమంపై కార్యకర్తలతో సమావేశం

ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభ కార్యక్రమంపై బుధవారం సాయంత్రం 4గంటలకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. చాపాడులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

తహసీల్దారు లేక ఇబ్బందులు

కాశినాయన : మండలంలో పది రోజులుగా తహసీల్దారు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీలోపు ఈబీసీ నేస్తం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ. దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు దరఖాస్తుకు తప్పనిసరిగా అందజేయాలని సచివాలయ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ నెల 3వ తేదీన ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న రామచంద్రుడు నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తిరుపతి జిల్లా నుండి తహసీల్దారుగా కుప్పయ్యను నియమించారు. ఆయన విధుల్లో చేరలేదు. తిరిగి అదే జిల్లా నుండి ఎల్.వి.ఎస్.క్రిష్ణను తహసీల్దారుగా నియమించారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించలేదు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్నను వివరణ కోరగా తహసీల్దారుగా క్రిష్ణను నియమించారని, ఆయన కడపలో ఆర్డర్స్ తీసుకుని ఎన్నికల శిక్షణకు వెళ్లారని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమంలో తెలిపి పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. 99592 25777 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను, సలహాలు తెలపాలని కోరారు.

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

కలసపాడు : ఈ నెల 16వ తేదీన కేంద్ర కార్మిక రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బంధు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రమైన కలసపాడులోని కొత్త ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా సహాయ కార్యదర్శి సగిలిగురయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సునీల్‌లు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాడులుగా మారి రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. రైతు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. కార్మికులు, సంఘటిత, అసంఘటిత వ్యవసాయ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మేరీ, కెవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్, ఏఐఏడబ్ల్యూయూ మండల నాయకుడు సుదర్శన్, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఎస్.రమణ

మైదుకూరు : విద్యుత్ వృథాను అరికట్టేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని ఎల్లంపల్లె, వనిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డివిజన్ కార్యాలయంలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. కోట్ల రూపాయలు వెచ్చించినా విద్యుత్ లభ్యం కావడం లేదని, అందువల్ల ఒక్క యూనిట్ వృథా చేయవద్దని తెలిపారు. రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. వేసవిలో నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు అవసరమైన చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పగటిపూట విద్యుత్ లైట్లు వెలగకుండా చర్యలు తీసుకున్న మైదుకూరు మండలం వనిపెంట సిబ్బంది లక్ష్మణరావు, బాలనాగయ్యలను ఎస్ఈ శాలువాతో సత్కరించి అభినందించారు. సమావేశంలో ఈఈ జీవీ రామిరెడ్డి, డీఈఈ శ్రీనివాసులరెడ్డి, ఏఈ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ఆయన కార్మికులతో కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ జనవరి 3 నుంచి 10వ తేదీ వరకు జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో ప్రభుత్వం చర్చలో అంగీకరించిన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. 10 రోజుల్లో సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లిస్తామన్నారని, నెల దాటినా ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్, గురుమూర్తి, ప్రసాద్, ప్రమీల రాణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు యాదవుల ఆత్మీయ మహాసభ

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రహ్మంగారిమఠం మండలం రేకులకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీరాణిబావి గంగమ్మతల్లి ఆలయంలో గురువారం ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలోనే మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యాదవుల ఆత్మీయ మహాసభను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

బీరువా వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ విభాగం (2010–14) మొదటి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు కళాశాలలోని ఎంఎంటీ విభాగానికి స్టీలు బీరువా బహుమతిగా అందించారు. డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ ఎస్.హరినాథ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు పూర్వ విద్యార్థులను అభినందించారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : ఈనెల 14, 15 తేదీల్లో భవానీ భక్తుడు, గురు సద్గురు సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆధ్యాత్మిక రచయిత కృష్ణనాయక్ బంజారాలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సేవాఘడ్‌లో రెండు రోజులపాటు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ఆయన జయంతి నిర్వహిస్తున్నదన్నారు. గుత్తి సమీపంలోని సేవాఘడ్‌కు దేశ నలుమూలల నుండి బంజారా రాజపుత్రులు తరలి వస్తారన్నారు. జిల్లాలోని బంజారాలు వేడుకల్లో పాల్గొనాలని కృష్ణనాయక్ పేర్కొన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయాలి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : అనంతపురంలో ఈనెల 18న తలపెట్టిన సిద్ధం సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారందరూ ఈ సభకు హాజరుకావాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఈ సిద్ధం సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా వైఎస్సార్‌సీపీ నాయకులు జనసమీకరణ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ కానాల ఓబులరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు కోగటం వీరారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పీవీ రమణయ్య నాయుడు, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, వీవీ స్వామి, మాజీ ఎంపీపీ ఓబయ్య, దువ్వూరు సొసైటీ చైర్మన్ ఇరగంరెడ్డి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఖరీదైన వైద్యం



ప్రొద్దుటూరు క్రైం : వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఖరీదైన వైద్యం అందుతోందని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పెన్నానగర్ వికాస్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు నాగార్జున, ఫర్హానా, అనూష, చంద్రమౌళిలు వైద్య సేవలు అందచేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 408 మందికి చికిత్సలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరినాథ్, నూర్ అహ్మద్, నజీర్ అహ్మద్, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఫార్మాసిస్టు శ్రీధర్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

చాపాడు : ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని మండల అభివృద్ధి అధికారి మహబూబ్ బీ పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించిన ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం ఒక గ్రామ సచివాలయ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈ శిబిరంలో వైద్యాధికారులు కావ్యమాధురి, ఓబులేసు, ప్రత్యేక వైద్యులు రియాజ్, సాజిద్ బాషా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఆశ నోడల్‌పర్సన్ సుకన్య, హెల్త్‌అసిస్టెంట్లు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫిక్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజలు మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫిక్ పేర్కొన్నారు. మంగళవారం భారత్ ఫంక్షన్ హాల్‌లో జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం – ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే అంశంపై బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవనం విచ్ఛిన్నం అవడం వలనే యువత చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మద్యం, మత్తు పదార్థాల వల్ల అనారోగ్యంతో జీవితం నాశనం అవుతుందని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటే దైవభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. భక్తి మనిషిలో పరివర్తన తెస్తుందని, అందువల్ల యువత తాత్విక చింతనను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, మంచి స్నేహితుల ద్వారా చెడు వ్యవసనాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు వలీయుల్లా సయిాది ఫలాహి, పట్టణాధ్యక్షుడు షఫివుల్లా, మీడియా ఇన్‌చార్జి షరీఫ్, కరీముద్దీన్, గౌస్ మొహిద్దీన్, హుస్సేన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ



ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : కనీస జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం గౌతమి ఇంజనీరింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన పెంచడానికి ప్రభుత్వం నెల రోజుల పాటు అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ద్వారా రూపొందించిన నియమనిబంధనల గురించి ప్రజలకు చెప్పడానికి వర్క్ షాపులు, సెమినార్‌లు, సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థినులు తప్పకుండా మొబైల్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థినులు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు గానీ, బస్సు కోసం వేచియున్నప్పుడు ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఎదురైతే దిశ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బమ్మ, ఎంవీఐ నారాయణనాయక్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

మైదుకూరు : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించాలని అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ అన్నారు. మంగళవారం అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని ఆటో డ్రైవర్లతో సీఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆటోలకు కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అర్బన్ సీఐ రాజరాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

బద్వేలు అర్బన్ : విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకుని ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవీఐ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయనులు పాల్గొన్నారు.